# ౨. మేల్కొలుపు

వివాహమైన మూడు సంవత్సరాల వరకూ ఆమె సిరీలోని భర్త గృహంలోనే వుండిపోయింది. సిరీలో ఆమె భర్తకు రెండు దూదిమిల్లులున్నవి. ఆమెకు పిల్లలు లేకపోయినా శాంతియుతమైన జీవితాన్ని గడిపేది. ఆ చెట్లమధ్య ఆమె ఆనందంగా, ఒంటరిగా కాలం వెళ్ళబుచ్చేది.

ఆమె భర్త ఆమెకన్న చాలా పెద్దవాడు. ఆమెపట్ల ఎంతో దయగా ఉండేవాడు. ఆమెకూడా అతన్ని గాఢంగా ప్రేమించింది. ఏ విధమైన చెడుతలపులూ ఆమెను ఆవరించేవి కావు. ఆమె తల్లి మాత్రం ఎండాకాలంలో వచ్చి, చలికాలంలో పారిస్‌కు తిరిగి వెళ్తూండేది.

ఆకురాలే కాలంలో జినీకి దగ్గు వచ్చేది. ఆ లోయలో గుండా ఒక నది ప్రవహిస్తుంది. సంవత్సరంలో ఐదు నెలలపాటు దట్టమైన పొగమంచుతో ఆ లోయ నిండి వుంటుంది. పదిగజాల దూరంలో వున్న వస్తువు కూడా కనిపించనంత పొగమంచులో ఐదు నెలలు గడపాలి! కొండమీదకి ఎక్కుతే పొగమంచులో నుంచి పొడుచుకొచ్చిన ఇంటి కప్పులు మాత్రం కనిపిస్తవి. దూదిమిల్లుల తాలూకు పొగగొట్టాలు రేయింబవళ్ళు నల్లనిపొగను వెడలగ్రక్కుతూనే వుంటవి. యీ కారణాల వల్ల మాత్రమే అక్కడ జన సంచలనం వున్నదని తోస్తుంది.

ఆ సంవత్సరం అక్టోబర్‌లో జినీని పరీక్షించి ఆ లోయలోని గాలి బలహీనమైన ఊపిరితిత్తులకు ప్రమాదకరంగా వుంటుందని, ఆ చలికాలమంతా పారిస్‌లోనే గడపమని డాక్టర్ సలహా ఇచ్చాడు. ఆమె పారిస్ వచ్చేసింది. ఒక నెల వరకూ ఆమె విడిచి

వచ్చిన ఇంటిని గూర్చి, తనకు ఇష్టమైన విధంగా అమర్చుకున్న ఫర్నిచర్‌ను గూర్చి ఆలోచించేది. క్రమంగా ఈ కొత్త వాతావరణానికి ఆమె అలవడింది. వినోద ప్రదర్శనాలు, నాట్యాలు, విందు భోజనాలు మొదలైన వాటిమీద ఇష్టంగా వుండసాగింది.

ఆనాటి వరకూ ఆమె చిలిపిపిల్లగానే వుండేది. చిరునవ్వుతో, గర్వంగా నడుస్తూ, అల్లరిగా నవ్వుతుండేది. కాని ఇప్పుడు ఆమెలోని స్త్రీత్వమంతా విజృంభించినట్టుగా, లోకంలో కోరదగింది జీవితానందమేనన్న ధోరణి స్పష్టంగా ఆమెలో కనిపించేది. పురుషులు ఈ వాసనను పట్టేందుకు ఎక్కువకాలం పట్టలేదు. వాళ్ళ మాటల్ని విని ఆమె ఆనందించేది, వారి కోతలకు నవ్వేది. ఐనప్పటికీ వారినుంచి తనను కాపాడుకోగలననే ధైర్యం ఆమెకు ఉంది. వైవాహిక జీవితానుభవంలో ప్రణయమంటే ఆమెకు మొహం మొత్తింది. అందమైన తన శరీరాన్ని, యవ్వనాన్ని ఈ మొరటు పురుషుల ఆనందం కోసం అప్పగించటమంటే, ఆమె అమాయకంగా వొణికేది, పురుషుల అవస్థకు జాలిగా నవ్వేది.

కొత్త పురుషులతోడి శారీరక సంబంధానికి యీ ఆడవాళ్ళు ఎలా ఒప్పుకోగలుగుతారో ఆమెకు అర్థమవలేదు. ఒక్క భర్త ఆనందం కోసం తనను తాను నీచపరుచుకోవడం చాలక, ఈ స్త్రీలు మిగతా పురుషులక్కూడా మొహమాట పడటం ఎలా సాధ్యమో ఆమెకు అంతుపట్టలేదు. తన భర్త, తనూ కేవలం స్నేహితుల వలెనే ఉండగలిగితే, తాను అతన్నింకా ప్రేమించగలిగేది!

వారి పొగడ్తలను, ఆకలితో కూడిన వారి కళ్ళను, రహస్యంగా తన చెవిలో ఊదే ప్రణయ కవిత్వాలకు ఆమె ఆనందించింది. ఒక్కో సమయంలో వారి గుసగుసలు తనకు తెలిసేవి కావు. కాని తానే వూహించి గ్రహించుకునేది. ఇంత జరిగినా ఆమె రక్తం వేడెక్కదు. హృదయం స్పందించదు. తనలో తాను మాత్రం గర్వించేది. ఏదో చెప్పలేని ఆనందం కలిగేది. కళ్ళు ప్రకాశవంతమై, పెదవులు వొణికేవి. స్త్రీ హృదయం కోరే గౌరవాన్ని అనుభవించి ఆనందించింది.

విందు భోజనాలంటే ఆమెకు ఇష్టం. భోజనాలయాక కులాసాగా కబుర్లు చెప్పుకోవడం- తనను వెన్నాడుతూ ఒక పురుషుడు తారట్లాడటం, తనను ఇంటిదాకా దిగిడ్చి, ఏదో అనుమానిస్తూ, భయపడుతూ, వొణుకుతూ, చివరికి మోకాళ్ళ మీద నిలబడి ప్రార్థించేవరకూ రావటం, ఆమెకు ఎంతో ఆనందాన్ని కలిగించేది. పురుషుని యీ అవస్థకు తనలో తాను గర్వపడేది. కాని అతని ఈ ప్రణయం ఆమెను ఏవిధంగానూ కదల్చలేదు. మెల్లిగా అతని చేతుల్ని విడిపించుకునేది. తలతో తన అయిష్టాన్ని ప్రకటించేది. సేవకుని కోసం గంట వాయించేది. సేవకుని అడుగుల చప్పుడు వినపడటంతోటే కోపంతో, అవమానంతో వొణికిపోతూ ఆమె పాదాల ముందునే లేచి నిలబడేవాడు.

ఆమె చాలాసార్లు కఠినంగా నవ్వింది. దాంతో ఉద్రేకపూరితమైన యువకుల కవిత్వం కట్టుబడిపొయ్యేది. ఒకోసారి చాలా కఠినంగా మాట్లాడటంతో, యువకులు కుంగిపోయే వాళ్ళు. ఆమె యీ మాటల ధోరణి, కంఠస్వరం విన్న యువకులకు జీవితంలోని ఆశలన్నీ వదులుకొని ఆత్మహత్య చేసుకోవాలనిపించేది. ఐతే తమ పట్టును విడువకుండా ఆమెను ప్రేమించి వెంటాడగలిగిన ఇద్దరు యువకులున్నారు. ఒకరికీ వేరొకరికీ పోలికే లేదు. మొదటివాడు పాల్. అందంగా పొడుగ్గా, సరదాగా వుంటాడు. ప్రణయ రంగంలో స్త్రీలను వలలో వేసుకోగల నేర్పు, ఆ కీలకాలూ, వేచివుండి సమయం వచ్చినప్పుడు దాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకునే మెలకువలు అతనికి బాగా తెలుసు.

ఇక రెండో యువకుడు జాన్– ఆమెను సమీపించినప్పుడు వణికిపోయి తన ప్రణయాన్ని వెలిబుచ్చలేని స్థితిలో వున్నప్పటికీ ఆమెను నీడలాగు వెంటాడుతూ, చూపుల్లోనే తన వాంఛల్ని ఇముడ్చుకునేవాడు. ఆమెకు సేవ చేయటం అతనికెంతో ఆనందంగా వుండేది. ఆమె అతన్ని ఒక సేవకుని వలెనే చూసేది. ఐతే తను జాన్‌ను ప్రేమిస్తున్నట్టు ఎవరైనా చెప్పినట్టయితే ఆమెకు ఆనందం కలుగుతుంది. ఒక ప్రత్యేక దృష్టితోనే తను అతన్ని ప్రేమించటంలో అబద్ధమేమీ లేదు. అతనితో ఎక్కువకాలం గడపటం వల్ల అతని కంఠస్వరానికీ, కదలికలకూ, ప్రవర్తనకూ బాగా అలవడింది. చాలాసార్లు జాన్ ఆమెకు కలలో కనిపించాడు. నిత్యజీవితంలో వలెనే స్వప్నంలో కూడా అతని లొంగుబాటు ధోరణి, మృదువుగా మాట్లాడటం, తనను దేవతవలె ఆరాధించటం... తనను ఎంతో గాఢంగా ప్రేమించటం ఆమె గమనించకపోలేదు. మెళుకూ వచ్చాక కూడా కలలో ఆమె చూసిన ప్రతి విషయమూ ఆమెను వేధించేది. ఒకసారి తనూ జానూ ఒకరి పక్కన ఒకరు అడివిలోని పచ్చిగడ్డి మీద కూర్చొని మాట్లాడుకుంటున్నట్లు కలగన్నది. తనకెంతో దగ్గరికి జరిగి మధురతమమైన మాటల్ని చెపుతూ మృదువుగా తన చేతుల్ని అతని చేతుల్లోకి తీసుకొని ముద్దుపెట్టుకున్నాడు. అతని శరీరోష్ణం, విడిచిన గాలిలోని వేడి ఆమె గ్రహించింది. ఆ ఆనందంలో ఆమె ప్రేమపూర్వకంగా అతని తలను నిమిరింది... కల!

నిత్య జీవితంలో కన్న స్వాప్నిక జగత్తులో మనం వేరువిధంగా వుంటాం. స్వప్నంలో తనకు అతని మీద ఎంతో గాఢమైన ప్రేమవున్నట్లు, అతన్ని తన దగ్గరకు లాక్కున్నప్పుడు ఎంతో ఆనందం కలిగినట్లు తోచింది. తప్పుకునేందుకు వీల్లేకుండా అతను తనను రెండు చేతుల్లోనూ పొదివి పట్టుకొని, తన కళ్ళ మీదా, బుగ్గలమీదా వేడిముద్దుల్ని కురిపించాడు. వారి పెదవులు కలవటంలో తను పూర్తిగా లొంగిపోయింది.

ఆ తరువాత నిత్యజీవితంలో అతను తిరిగి తనను కలుసుకొని, తన ప్రేమను వెల్లడి చేస్తున్నప్పుడు, తనకు తెలియకుండానే ఉద్రేకపడింది. స్వప్నంలో చూసిన విషయాన్ని ఎంత ప్రయత్నించినా మరచిపోలేకుండా బాధపడసాగింది. తను అతన్ని ప్రేమించింది. మరీ కల తాలూకు జ్ఞాపకాలతో ఆమె ప్రణయం మరింత గాఢంగా

పాతుకొని పోయింది. అంతకు పూర్వం పురుషుడంటే వున్న ఏవగింపు పోయి, ఈ యువకుణ్ణి మనసారా కోరసాగింది.

ఆమె అవస్థ జాన్‌కు అర్థమైంది. ఆమె ఆగలేక, వున్నది వున్నట్టుగా అంతాచెప్పి, తనను అగౌరవపరచనని వాగ్దానం తీసుకుంది. వారు అనేక గంటలు గడిపేవారు. ఆ సమయంలో వారి ఆత్మలు మాత్రమే కలుసుకునేవి. విడిపోయే సమయంలో ఎంతో బలహీనంగాను, బరువుగానూ వున్నట్టుగా వారికి తోచేది.

ఒక్కో సమయంలో వారి పెదవులు కలిసేవి. పవిత్రమైన కౌగిలింతలో కాలం దొర్లిపోయేది. అతను మరి ఈ అవస్థను ఎదుర్కోలేడని ఆమెకు తోచింది. తను లొంగిపోవలసి వస్తుందనే భయంవల్ల తన భర్తకు ఉత్తరం రాసింది– తనను వెంటనే వచ్చి తీసుకొని వెళ్ళమని. దానికి జవాబుగా ఆమె భర్త చాలా దయగా ఒక ఉత్తరం రాశాడు. అందులో చలికాలం మధ్యలో రావద్దనీ, శీతోష్ణస్థితుల మార్పువల్ల ఆరోగ్యం చెడుతుందనీ, అక్కడి పొగమంచు చాలా హానికరంగా వుంటుందనీ, తెలియపరిచాడు. తన అవస్థను అర్థంచేసుకోలేక, గ్రహించక, తన హృదయారాటాన్ని తెలుసుకోలేని ఆ భర్తమీద ఆమెకు ఎంతో కోపం వచ్చింది.

ఫిబ్రవరి నెలలో సూర్యుడు కాస్త వేడిగానూ, ప్రకాశవంతంగానూ వున్నాడు. ఈ మధ్య ఆమె సాధ్యమైనంత వరకూ జాన్ నుంచి తప్పించుకు తిరిగేందుకు ప్రయత్నిస్తూ, ఒకోసారి అతనితోపాటు కాస్త దూరాన ఉన్న సరస్సు దగ్గరకు సాయంత్రంపూట షికారు వెళ్ళే ఆహ్వానాన్ని తోసిపుచ్చలేకపోయేది. ఒకనాటి సాయంత్రం వారి బండి పెళ్ళినడక సాగిస్తూంది. సందె వెలుగులో వారు ఒకరికొకరు చాలా దగ్గర్లో కూర్చొని, ఒకరి చేతుల్ని మరొకరు పెనవేసుకున్నారు. ఆమె తాను క్రమంగా లొంగిపోతున్నాననీ, ఇక తనను తాను రక్షించుకునే శక్తి తనకు లేదని భావించింది. ఆనాటి కలలో తాను పొందిన అనుభూతులనుంచి, తప్పించుకోలేని దౌర్బల్యానికి గురవుతున్నానని తనకు తెలుసు. ప్రతిక్షణంలోనూ వారి పెదవులు కలిసేవి. కాని తిరిగి కలుసుకునే ఉద్దేశ్యంతోనే అవి వెంటనే విడివడేవి.

ఇంటికి రాగానే జాన్‌కు ఆమెతో పాటు ఇంట్లో ప్రవేశించే ధైర్యం లేకపోయింది. ఆమెలో మాత్రం ప్రణయజ్వాల నాలుకలు చాచింది. ఏమీ అనలేక ఏదో మూర్ఛలోనే ఆమె ఇంట్లోకి వెళ్ళింది. గదిలో ఆమెకోసమే పాల్ నిరీక్షిస్తున్నాడు. దీపం లేకపోయినా, తనను గుర్తించి అతను ఆమెతో కరస్పర్శ చేసినప్పుడు ఆమె శరీరం ఎంత వేడెక్కివుందో గ్రహించ గలిగాడు. మెల్లిగా మృదువుగా మాట్లాడుతూ, అలసిపోయిన ఆమెకు జోలపాడేందుకు ప్రయత్నించాడు.

పాల్ మాట్లాడుతున్నంతసేపూ ఆమె ఆలోచనలన్నీ జాన్‌మీదనే వుండటం వల్ల ఏ జవాబునూ ఇవ్వలేదు. ఆ మాటలన్నీ జాన్ మాట్లాడినట్టే భావించి, అతనే ఆపుకోలేని

ఉద్రేకంతో తనపైకి వాలుతున్నాడని ఆమె భావించుకోసాగింది. లోకంలో మరి పురుషులే లేనట్టు జాన్ ఆలోచన మినహాగా వేరొక ఆలోచనే ఆమెకు కలగటం లేదు.

"నిన్ను ప్రేమిస్తున్నాను!"

యీ మాటల్తో ఆమెకు మెళకూ వొచ్చినట్టయింది. తనను చేతుల్లోకి లాక్కుని ముద్దుపెట్టుకుంటున్నది పాల్ అనే సత్యాన్ని ఇప్పుడే ఆమె గ్రహించింది. జాన్ ఒక్కడే తనను జయించి, విజయ సూచికంగా తనను ముద్దాడగలిగాడు. తన కోర్కెల్ని మేల్కొల్పి తనకు తానుగా లొంగేట్టు చేసుకోగలిగి, తనను కావిలించుకొని ఆనందపరచగలిగాడు. కాని ఈ పాల్! ఇతన్ని గమనించగానే ఆమె ఒక కేక వేసింది. తనకు ఎంతో ఆనందాన్నిచ్చిన ఆమెకు కృతజ్ఞత తెలుపుతూ పాల్ ఆమెను ముద్దాడుతున్నాడు. ఆమె కోపంతో అంది: "వెళ్ళిపో. ఇక్కడ్నుంచి ఫో!"

యీ మాటలకు అర్థం తెలియక, తిరిగి ఆమెను తన కౌగిలిలోకి తీసుకునేందుకు పాల్ ప్రయత్నించాడు. కాని ఆమె అతన్ని విదిలించి "ఫో నీచుడా! నువ్వంటే నాకు తగని అసహ్యం!" అంది. పాల్ ఆశ్చర్యపోతూ మారుమాటాడకుండా జారాడు.

మర్నాడు ఆమె సిరీకి తిరిగి వెళ్ళింది. ఇంత త్వరగా ఆమె వస్తుందనుకోని భర్త ఆమె ఈ రాకను నిందించాడు. "మిమ్మల్ని వదిలి నేను ఎక్కువకాలం ఉండలేను" అందామె.

ఆమె కదలికల్లోనూ, ప్రవర్తనలోనూ మార్పును గమనించి అతను "ఏమైంది? నువ్వు బాగా మారిపొయ్యావు. విచారంగా వున్నావు. నీకేం కావాలి? నీకు సుఖంగా లేదా?" అన్నాడు.

"ఏమీ లేదు. ఈ లోకంలో సౌఖ్యమనేది స్వప్నంలోనే లభిస్తుంది" అందామె.

ఆ ఎండాకాలంలో జాన్ ఆమెను చూసేందుకు సిరీ వొచ్చాడు. ఆమె ఈ రాకకు విచారపడనూ లేదు, ఆనందించనూ లేదు. ఏ విధమైన ఉద్రేకమూ లేకుండానే అతన్ని చూడగలిగింది. తనసలు జాన్‌ను ప్రేమించనేలేదని ఆమెకు హఠాత్తుగా తోచింది. ఒక్క స్వప్నంలో మాత్రమే తను ప్రేమించింది. ఆ స్వప్నం నుంచే పాల్ తనను క్రూరంగా మేల్కొల్పి, తన స్వాప్నవి కానుభూతుల్ని పాడుచేశాడు.

కాని జాన్ మాత్రం ఆమెను ఇంకా ఆరాధిస్తూనే వున్నాడు. పారిస్‌కు తిరిగివస్తూ స్త్రీలు చాలా విచిత్ర వ్యక్తులనీ, అర్థంకాని అగాధాల్లోకి లాగుతారనీ అతను తలిచాడు.